క్లుప్తంగా

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా మునిసిపల్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రభావతి మాట్లాడుతూ.. యువత భవిష్యత్‌ను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. డ్రగ్స్ ప్రభావం నుంచి సమాజాన్ని రక్షించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో చైతన్యం పెరిగి, డ్రగ్స్ వాడకంపై నియంత్రణ సాధ్యం అవుతుందని పేర్కొన్నారు.

పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ సేవా కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థిని చదువు కోసం రూ.8 వేల ఆర్థిక సాయాన్ని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా బుధవారం అందచేశారు. నున్న గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని తల్లి షేక్ నసీమాకు కండ్రికలోని కమిటీ కార్యాలయంలో ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, నగర ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్, గన్నవరం నియోజకవర్గ కమిటీ సభ్యులు షేక్ సత్తార్, మీనాక్షి నగర్ అధ్యక్షుడు షేక్ షబాషి, 64,61,60వ డివిజన్ల ప్రతినిధులు, పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర దేవస్థానం హుండీ ఆదాయం రూ.4.25 లక్షలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేటలో చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసియున్న శ్రీ కాశీవిశ్వేశ్వర, అన్నపూర్ణ దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు బుధవారం జరిగింది. ఈ ఏడాది మార్చి 20 నుంచి హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకల రూపంలో ఆలయానికి రూ.4.25 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ సీతారామయ్య తెలిపారు. కానుకల లెక్కింపులో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అద్దేపల్లి మాధవరావు, దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ, పోలీస్ శాఖ, హిందూ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 83 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 83 మందికి న్యాయస్థానం జరిమానాలు విధించింది. నగరంలోని ఆరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 83 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని 6వ, 7వ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌ల కోర్టుల్లో హాజరు పరచగా న్యాయమూర్తులు లెనిన్ బాబు, ఆర్.వి.ఎస్.శర్మ జరిమానాలు విధించారు. ఏడుగురికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 76 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

ఎస్ఆర్ఆర్‌లో 'నిషా ముక్తి భారత్'



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిషా ముక్తి భారత్ అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మద్యపానం, మత్తు పదార్థాల వాడకం పట్టణాల నుంచి గ్రామాలకు వ్యాపించిందని విచారం వ్యక్తం చేశారు. హెల్త్‌కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనారోగ్య, సామాజిక సమస్యల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి.ఎస్.డి.ఎస్.బాలసుబ్రహ్మణ్యం, డి.యుగంధర్, కె.రమేష్, జె.నాగేశ్వరరావు, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆందోళన చెందాల్సిన పనిలేదని 30వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ రావు బుధవారం బుడమేరు మధ్య కట్టలో మైక్‌ప్రచారం నిర్వహించారు. బుడమేరు వరద పెరుగుతుందంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని, ఇళ్లలోకి నీరు వచ్చిన వారు పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. బుడమేరు ముంపు ప్రాంతాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

టీములు సరే.. క్విక్ రెస్పాన్స్ ఏదీ..?

- నగరంలోని 42 ప్రాంతాల్లో మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీంల ఏర్పాటు
- మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తారని భారీ ప్రచారం
- ఆచరణలో మాత్రం ఈ టీముల పనితీరు శూన్యమని విమర్శలు
- క్విక్ రెస్పాన్స్ టీములు పనిచేస్తే ముగ్గురు మృతిచెందేవారు కాదని వాదన
- డ్రెయినేజీ నిర్మాణ ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం





వీఎంసీ ఏర్పాటు చేసిన మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీములు వరద నీటిని తోడే యంత్రాలు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో చినుకు పడితే చింతించాల్సిందే. భారీ వర్షం పడితే బయటకు వెళ్లిన వ్యక్తులు తిరిగి ఇంటికి వచ్చే వరకు కుటుంబ సభ్యులకు ఆందోళనే. నగర ప్రజలకు తక్షణ సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాటుచేసిన మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీములు పనిచేస్తున్నాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా రోడ్లపైకి చేరిన వర్షపునీరు, వాగులను తలపిస్తూ ఉప్పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు ప్రజలను భయపెడుతున్నాయి. నానాటికీ పెరుగుతున్న జనాభా దృష్ట్యా నగరపాలక సంస్థ సరైన డ్రెయినేజీని ఏర్పాటు చేయకపోవటంతో ఏటా వర్షాకాలంలో డ్రెయిన్లలో పడి వ్యక్తులు చనిపోతూనే ఉన్నారు. తాజాగా వన్‌టౌన్‌లో ఇద్దరు, గుణదలలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది పటమటలో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పడి చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. డ్రెయిన్ల నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎలాంటి హెచ్చరిక/సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేరుకే క్విక్ రెస్పాన్స్ టీములు

నగరంలోని వరద రాకముందు, వచ్చినప్పుడు, తర్వాత తీసుకునే చర్యలకు సంబంధించి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఆర్భాటంగా మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేశారు. నగరంలో గుర్తించిన 42 ప్రాంతాల్లో ఈ టీముల కోసం షెల్టర్లు ఏర్పాటు చేశామని, భారీ వర్షాలు కురిసినప్పుడు తక్షణం సహాయక చర్యలు చేపట్టడం, ప్రజలను అప్రమత్తం చేసేందుకు మైక్‌లతో ప్రచారం నిర్వహించడం, రోడ్లపైకి చేరిన వర్షం నీటిని యంత్రాలతో ఎప్పటికప్పుడు క్విక్ రెస్పాన్స్ టీముల సిబ్బంది తోడేస్తారని నగరపాలక సంస్థ అధికారులు ప్రచారంతో హోరెత్తించారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తారని గొప్పలు చెప్పారు. ఈ టీములు వాస్తవంగా విధులు నిర్వహిస్తే నగరంలో డ్రెయిన్లలో పడి ముగ్గురు ఎలా మృతి చెందుతారని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వేసవి తర్వాతే పనులు ప్రారంభం

నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 42 ప్రాంతాల్లో వర్షపు నీటి మళ్లింపునకు డ్రెయిన్ల నిర్మాణానికి ఈ ఆర్థిక సంవత్సరంలోనే నగరపాలక సంస్థ రూ.17.30 కోట్లు వెచ్చిస్తోంది. సర్కిల్-1 పరిధిలోని 10, సర్కిల్-2 పరిధిలో 19, సర్కిల్-3 పరిధిలోని 13 ప్రాంతాల్లో స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్ పనులను ప్రారంభించింది. సుమారు 50 కిలోమీటర్ల మేర వేసవి తర్వాత స్ట్రామ్‌వాటర్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం మూడు కిలోమీటర్ల మేర మాత్రమే నిర్మాణం పూర్తయింది. 47 కిలోమీటర్ల మేర పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

నగరంలో వర్షపునీరు నిల్వ ఉండే ప్రాంతాలు ఇలా..

నగరంలో అత్యధికంగా వర్షపు నీరు నిల్వ ఉండే 40 ప్రాంతాలను నగరపాలక సంస్థ గుర్తించింది.

సర్కిల్-1 పరిధిలో..

కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఉన్న లోబ్రిడ్జి, దుర్గగుడి సమీపంలోని మసీదు వద్ద, భవానీపురం హెడ్ వాటర్ వర్క్స్ వెంబడి, కుమ్మరిపాలెం సెంటర్, వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న అండర్ పాస్ వద్ద అత్యధికంగా నీరు నిలువ ఉంటుంది.

సర్కిల్-2 పరిధిలో..

ప్రకాశం రోడ్డులోని లత సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద, ఏలూరు రోడ్డులోని విజయ టాకీస్ సెంటర్, ఆంజనేయస్వామి గుడి, వేముల శ్యామలదేవీ రోడ్డు, ప్రకాశంరోడ్డులోని ప్రజావైద్యశాల, సత్యనారాయణపురంలోని స్వర ఆస్పత్రి, భానునగర్, లోటస్ ల్యాండ్‌మార్క్, రామమందిరం రోడ్డు, వ్యాకరణం రోడ్డు, గాంధీనగర్ ఎన్నార్పీ రోడ్డు, అజిత్‌సింగ్‌నగర్ ఆర్‌యూబీ, పటేల్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్‌లోని అంతర్గత రోడ్లు, రాజీవ్‌నగర్ కట్ట అంతర్గత రోడ్లు, సింగ్‌నగర్ ప్రధాన రహదారి, నూజివీడు రోడ్డు, బర్మా కాలనీ, బందరురోడ్డులోని రాఘవయ్య పార్కు వద్ద, ఇన్నర్ రింగ్‌రోడ్డు రామవరప్పాడు వైపు, మధురానగర్ ఆర్‌యూబీలో నీరు అత్యధికంగా నిల్వ ఉంటుంది.

సర్కిల్-3 పరిధిలో..

పుల్లేటికట్ట డ్రెయిన్, బాయన బాపూజీ రోడ్డు, ఆయూష్ ఆస్పత్రి, విజేత సూపర్‌మార్కెట్ ఎదురు, జాతీయ రహదారి వెంబడి గురునానాక్ కాలనీ జంక్షన్ నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లే రోడ్డు, రమేష్ ఆస్పత్రి నుంచి జంక్షన్ డీవీ మేనర్ రోడ్డు, పిన్నమనేని పాలి క్లినిక్‌రోడ్డు, బందరురోడ్డులో బెంజిసర్కిల్, హోటల్ మార్గ్ కృష్ణాయ, నిర్మల కాన్వెంట్ రోడ్డు, బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా, రేడియో స్టేషన్ ఎదురుగా, ఏపీఐఐసీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, ఎయిర్ పోర్టు కారిడార్ (రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం)లో నీరునిల్వ ఉంటుంది.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

– మేయర్ రాయన భాగ్యలక్ష్మి



పటమట(విజయవాడతూర్పు): లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నగర పాలక సంస్థ అధికారులను మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం ఆదేశించారు. కృష్ణానది, బుడమేరు పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరద ముంపు ప్రాంతాల వారిని దగ్గరలోని పునరావాస కేంద్రాలకు చేర్చాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని పేర్కొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వదంతులను నమ్మవద్దని సూచించారు. నగర పాలక సంస్థ ఎల్లప్పుడు ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి భరోసా ఇచ్చారు.

15న మాంసం విక్రయాలపై నిషేధం

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీన నగరంలో మాసం, చేపలు ఇతర మాంసం ఉత్పత్తుల విక్రయాలను నిషేధించామని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ అర్ధరాత్రి నుంచి విద్యాధరపురంలోని కబేళాకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు. నగరంలో జంతువధకు అనుమతి లేదని, నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చికెన్, మటన్‌షాపులు, చేపల మార్కెట్లు అన్నీ ఆ రోజు వ్యాపారాలు చేయటానికి అనుమతి లేదని స్పష్టంచేశారు. జీవాలను వధించినా, మాంసం విక్రయాలు చేసినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆందోళనలో బుడమేరు ప్రాంత ప్రజలు


మధురానగర్(విజయవాడసెంట్రల్): పెరుగుతున్న బుడమేరు వరద ప్రవాహం, విడవకుండా కురుస్తున్న భారీ వర్షంతో బుడమేరు మధ్యకట్ట, విజయదుర్గానగర్, రామకృష్ణాపురం, కేఎల్‌రావునగర్, లెనిన్‌నగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, అజిత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున ఒక్కసారిగా బుడమేరులో వరద ప్రవాహం పెరిగి విజయదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. బతుకు జీవుడా అంటూ ఇళ్లలో సామాన్లు తీసుకుని స్థానికులు రోడ్లపైకి చేరుకున్నారు. తరువాత వరద ప్రవాహం కొంత మేర తగ్గినా వర్షాలు కురుస్తుండటంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. కలెక్టర్ లక్ష్మీశ, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఈ ప్రాంతంలో పర్యటించారు. ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని, ముంపు బాధితులు అక్కడికి వెళ్లాలని సూచించారు. అయితే స్థానికులు పునరావాస కేంద్రానికి వెళ్లేందుకు ఆసక్తి చూపలేదు.

బాధితులను పరామర్శించిన కార్పొరేటర్ జానారెడ్డి

బుడమేరు ముంపు, బుడమేరు మధ్యకట్ట ప్రాంతాల్లో కార్పొరేటర్ బి.హెచ్.ఎస్.వి.జానారెడ్డి పర్యటించారు. స్థానికులను అడిగి వారి సమస్యలు అడిగి తెలుసుని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బుడమేరు ముంపు ప్రభుత్వ వైఫల్యం వల్లేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్. బాబురావు ఆరోపించారు. బుడమేరు ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

బుడమేరు ముంపు పాపం ఎవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది బుడమేరు వరద వచ్చినప్పుడు బుడమేరు ప్రక్షాళన చేస్తామంటూ ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు కనీస చర్యలు కూడా చేపట్టలేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మరోసారి వరదబారిన పడ్డామని ఆరోపించారు. వరద వచ్చినప్పుడు తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవటం తప్ప శాశ్వత ఏర్పాట్లు చేయడంలేదని దుయ్యబట్టారు.



విజయదుర్గానగర్ బుడమేరు మధ్యకట్ట వద్ద ఇళ్లలోకి చేరిన వరదనీరు



మధ్యకట్ట ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

సమాధానం చెప్పేవారు లేరు



ఒక్కసారిగా బుడమేరులో వరద ప్రవాహం పెరిగింది. మా ఇంట్లోకి వరద నీరు రావటంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యాం. స్థానికుల సహకారంతో ఇంట్లోని సామాన్లు తీసుకుని బయటకు చేరుకున్నాం. ఇంత జరుగుతున్నా కనీసం ఏం జరుగుతుందో సమాధానం చెప్పేవారు లేరు.

– సూరా వెంకటరమణ, సూరా అప్పలనరసమ్మ

సమాచారమే లేదు



గత జ్ఞాపకాలు మరువక ముందే మరో మారు బుడమేరు ఉధృతి పెరగటంతో భయంగా ఉంది. బుడమేరు వరద నీరు మా ఇంట్లోకి వచ్చింది. వరద నీటితో పాటు పాములు వస్తున్నాయి. మళ్లీ బుడమేరు బారిన పడాల్సి వస్తుందేమోనని భయంగా ఉంది. వరద సమాచారమే మాకు తెలియదు.

– దుంగా లక్ష్మి, విజయదుర్గానగర్

ఉప్పొంగి ప్రవహిస్తున్న బుడమేరు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గత ఏడాది నగర ప్రజలను ముంచెత్తిన బుడమేరు వరదలు మళ్లీ ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకుతోడు ఎగువ నుంచి బుడమేరుకు వరద పోటెత్తింది. ఫలితంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు చేస్తున్న హెచ్చరికలు స్థానికుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నాయి.

పొంగి పొర్లుతున్న బుడమేరు

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బుడమేరు పోటెత్తింది. రోడ్ల అంచులను తాకుతూ బుడమేరు ప్రవహిస్తోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న న్యూరాజరాజేశ్వరీపేట, జామతోట, సుబ్బరాజునగర్, సుందరమ్మదిబ్బ, సీతారామపురంకాలనీ, అరుణోదయనగర్, అమరావతికాలనీ, ఇందిరానాయక్‌నగర్, షణ్ముఖనగర్, సన్‌సిటీ కాలనీ, భారతమాత కాలనీ, నందమూరినగర్, తోటవారి వీధి, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర కలవరానికి గురవుతున్నారు.

నీటమునిగిన రోడ్లు

భారీ వర్షాలకు సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, పలు రోడ్లు జలమయమయ్యాయి. మోకాళ్ల లోతుల్లో నీరు నిలిచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



న్యూఆర్ఆర్‌పేట అపార్ట్‌మెంట్ల వెనుక బుడమేరు పొంగడంతో వరదనీటిలో మునిగిన పొలాలు



బుధవారం కురిసిన వర్షానికి ఎంజీ స్టేడియం వద్ద నిలిచిపోయిన వర్షపునీటిలో ప్రయాణికుల అవస్థలు

శివారు ప్రాంతాల్లో

భయం.. భయం

- భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ సూచన
- అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలింపునకు ఏర్పాట్లు

పాయకాపురం(విజయవాడరూరల్): భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ జారీచేసిన హెచ్చరికలతో శివారు ప్రాంతాల ప్రజలు భయపడుతున్నారు. ఉత్తర కోస్తాంధ్ర మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు జారీ చేయడంతో నగర పాలక సంస్థ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. నగరంలో మంగళవారం దాదాపు 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు.



రాజీవ్‌నగర్ కట్టపై ఏర్పాటు చేసిన మోటార్లు

నీటిని తోడేందుకు చర్యలు

కుందావారి కండ్రిక జంక్షన్లో అవుట్ ఫాల్ డ్రెయిన్ వద్ద నీటిని తోడేందుకు పది మోటార్లు, రాజీవ్‌నగర్ కట్ట పైన ఆరో మోటార్లను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. ఎల్‌బీఎస్ నగర్, సుందరయ్యానగర్, రాజీవ్‌నగర్, కండ్రిక, రాధానగర్, ప్రజాశక్తి నగర్ ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తోడేయడంతో నున్న, పాతపాడు, విలేజి కండ్రిక వంటి ప్రాంతాల నుంచి డ్రెయిన్ల ద్వారా వర్షం నీరు కండ్రిక పంపింగ్ స్టేషన్ వద్దకు చేరుకుంది. దీంతో నీటి ప్రవాహం ఉధృతంగా మారింది. పెరిగిన ప్రవాహానికి అనుగుణంగా 33 తూముల వరకు వెళ్లే నీటి ప్రవాహ సామర్థ్యం లేకపోవడంతో పంపింగ్ స్టేషన్ ప్రాంతం చెరువును తలపిస్తోంది.



కండ్రిక పంపింగ్ స్టేషన్ వద్ద పెరుగుతున్న వరద నీరు

శాశ్వత చర్యలు చేపట్టాలి

పంపింగ్ స్టేషన్ వద్ద కల్వర్టు, డ్రెయిన్ నిర్మించడానికి నగరపాలక సంస్థ రెండు కోట్ల రూపాయలను ఇటీవల మంజూరు చేసింది. ఆ పనులు ఇంకా ప్రారంభం కాలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో సంభవించిన బుడమేరు వరదల కారణంగా ఈ ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు మళ్లీ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దానికి తగ్గట్టుగా నగరపాలక సంస్థ మైకుల ద్వారా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేయడం వారి ఆందోళనను రెట్టింపు చేస్తోంది. అవసరమైతే లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయడంతో ప్రజలు తీవ్రంగా భయపడుతున్నారు. వరదల భయాన్ని పోగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుడమేరు వరదల సమస్య నుంచి శాశ్వతపరిష్కారం పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వర్షం పడితే భయమే



ఎప్పుడు భారీ వర్షాలు కురిసినా, వరదలు వచ్చినా పల్లపు ప్రాంత ప్రజలం భయపడుతున్నాం. లోతట్టు ప్రాంతాలు నీటమునడంతో భారీ నష్టం తప్పడంలేదు. ముంపు సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి.

– నాయుడు, సుందరయ్య నగర్

సామాన్లు సర్దుకోమంటున్నారు



ఎప్పుడు భారీ వర్షాలు కురిసినా గుండెల్లో గుబులు తప్పడంలేదు. అధికారులు మాత్రం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సామాన్లు సర్దుకోవాలని చెబుతున్నారు. ప్రభుత్వం వరదల నుంచి కాపాడాలి.

– నారాయణ,కండ్రిక

ప్రత్యేక బృందాలు అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీములు, ఫ్లడ్ రెస్పాన్స్ టీములు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ఆదేశించారు. కృష్ణానది, బుడమేరు పరీవాహక ప్రాంతాలకు వరద ముప్పు ఉన్నందున ధ్యానచంద్ర బుధవారం గుణదల వద్దగల పుల్లేటి కట్ట డ్రెయిన్, టిక్కిల్ రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, నిర్మల కాన్వెంట్ రోడ్డు, డెంటల్ కాలేజీ రోడ్డు, ఈఎస్ఐ రోడ్డు, దళితవాడ, ఏలూరు రోడ్డు, బుడమేరు ఏలూరు కాలవ మధ్యకట్ట, ఆర్టీసీ లేబర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరద ముంపు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు వెంటనే తరలి వెళ్లాలని, వారికి ప్లానింగ్ సిబ్బంది అవగాహన కల్పించాలని, మైకుల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాలకు ఫ్లడ్ రెస్పాన్స్ టీములు 24 గంటలూ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తూ, వరద నీరు నివాస ప్రాంతాల్లోకి రాకుండా ఎప్పటికప్పుడు గల్పార్లు, ఆయిల్ ఇంజిన్లతో తోడేయాలని ఆదేశించారు. సర్కిల్-1లో 13, సర్కిల్-2లో 19, సర్కిల్-3లో ఏడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సమీపంలోని సచివాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు.




వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

ఈ పర్యటనలో మునిసిపల్ జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు పాపం కూటమి ప్రభుత్వానిదే..

– వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ప్రక్షాళన చేస్తామంటూ చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోకపోవటం వల్లే మరోమారు ముంపు ప్రమాదం ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుడమేరులో నీటి ప్రవాహం పెరుగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోవటం లేదని, బుడమేరు ముంపు ప్రాంతవాసులకు పూర్తిస్థాయి సమాచారం కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. బుడమేరు ప్రక్షాళన చేసి ఉంటే నేడు ఈ పరిస్థితి ఉండేది కాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వందలాది కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తిస్తే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. అధికారులు, ప్రభుత్వం మొద్దు నిద్రవీడి బుడమేరు ముంపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకోవటంతో పాటు ప్రజల్లో భయాందోళనలు తొలగించాలని సూచించారు.